
డిటెక్టివ్ స్టోరీ

# కత్తికి కళ్ళుండవు!

- సారథి

ఒంటికన్ను తెరిచి చుట్టూచూశాడు శివ. గది చీకటిగా వుంది. పగలో, రాత్రో తెలియదు. అగ్గిపెట్టె, సిగరెట్ పాకెట్ కోసం వెదికాడు. జేబులో లేవు. స్టూలు మీద, ఇనప మంచం మీద వెదికాడు. కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటిలో కన్నుతెరిచిన ప్రతీసారీ భయంతో వణికిపోతాడు. ప్రమాదంలో మరో కన్నుకూడా పోయింటే యిప్పుడు తన పరిస్థితి మరెంత అధ్వాన్నంగా వుండేది. అగ్గిపుల్ల గీసి, సిగరెట్ వెలిగించాడు. వెచ్చనిపొగ వూపిరితిత్తుల్లో నిండి హాయిగా వుంది. ఇంకా ఆర్పని అగ్గిపుల్లతో కిరోసిన్ బుడ్డిదీపం వెలిగించాడు. ఆ గుడ్డి వెలుగులో పెచ్చులూడిన గోడలు పరిహసిస్తున్నట్టుగా వుంది. నేలమీద దుమ్మూ, సిగరెట్ పీకలు, కాగితం ముక్కలు, లేవలేని బద్ధకంతో వుమ్మేసిన మురికీ అసహ్యంగా కనిపించాయి. అతనికి తెలియటం లేదు గాని గదంతా దుర్గంధం నిండిపోయింది. అయితేనేం, అద్దె ఇవ్వక్కర్లేనప్పుడు కాటిలోనైనా సుఖంగానే వుంటుంది. బాటిల్‌లో సారా యింకా కొంచెం మిగిలింది. అది చాలు. గొంతు తడుపుకోవటానికి.



ఒకే గుక్క. ఛాతీలో చలిమంట వెలిగింది. నెత్తురు ఆవిరై ముక్కుపుటాల్లోంచి జ్వాలలు వెలువడుతున్నట్టుగా వుంది. "అవును. నా జీవితం ముగిసింది" అనుకున్నాడు. ఇన్నాళ్లూ గదిలో చిట్టెలుకలు తిరుగాడుతూ వుండేవి. కాని చలితీవ్రత పెరగటం, అవి ఎక్కడో కలుగుల్లో దాగున్నాయి కాబోలు. గాలి కూడా బరువెక్కి తన మీద కసిలా కప్పుకుంటున్నది. తడిగా వున్నచోట నాచుపట్టింది.

వెనక్కువాలి కూర్చున్నాడు శివ. మత్తుగా వుంది. చుక్కపడితే, అందర్లాగే అతడూ విచక్షణాజ్ఞానం కోల్పోతాడు. ఆలోచనలు ముందుకు సాగటం లేదు సరికదా, మెలికలు తిరిగి తనమెడకూ వురితాళ్లలా చుట్టుకుంటున్నది. విషసర్పాల్లా కాటేస్తున్నవి. తను, వున్నదంతా పోగొట్టుకుని బికారి కావటానికి కారణమెవ్వరు? తన పెళ్లాం. ఒకప్పటి తనపెళ్ళాం. రంగిని చంపెయ్యాల్సిందే. దాని మూలాన్నే వాచ్‌మన్ వుద్యోగం పోయింది. తాగుబోతుగా తయారయ్యాడు. తన చివరి కోరిక – రంగిని చంపడమే. ఆ తర్వాత తానూ పొడుచుకుని చస్తాడు. అదే కత్తితో! చంపటం పాపమా, పుణ్యమా, న్యాయమా, అన్యాయమా – అవన్నీ దేవుడు చూసుకుంటాడు.

పదునుపెట్టిన ఆరంగుళాల కత్తిని ప్రేమగా ముద్దాడాడు. కసుక్కున దాని పొట్టలో పొడిచి రెండుసార్లు అటూ యిటూ

తిప్పితే చాలు. ఈ బుజ్జిముండ దాని ప్రాణం తీస్తుంది. ఆ తర్వాత, నది గట్టుకెళ్లి తనూ మణి కట్టు కోసుకుంటాడు. అంతటితో ఈ సిన్మా ఖతం. ఒళ్లు, బిగువుగా వుందని గదూ అది అంత టెక్కు చూపింది! ఈ కత్తికి తెలుస్తుందా బిగువు. ఛా. అది ఆడదా. మటన్‌షాపులో వేళ్లాడదీసిన మేక లాగ పబ్లిగ్గా అందర్నీ వచ్చి చూడమంటుంది సిగ్గులేని కులట. సిగరెట్ పీకలతో రంధ్రాలు పడిన దుప్పటి కప్పుకుని దీపం ఆర్పేశాడు శివ. ఇవాళకాదులే. మరొక్కరోజు ప్రాణదానం చేద్దాం. రేపు సాయంత్రంలోగా దాని ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. కాని ఒక్కరోజైనా తనూ బతకాలిగా. ఆకలిగా వుంది. ఎన్నాళ్లూ తెలిసిన వాళ్ల ముందు చేతులు చాచటం! అమ్ముకోవటానికి కూడా ఏమీ మిగల్లేదు. కుక్కలు, పిల్లులు, ఎలుకల్లాగా తనూ బతుకుతున్నాడు. అడుక్కుంటూ ఎంగిలిమెతుకులు తింటూ, ముడుచుకుని పడుకున్నాడు. నిద్రపోతే ఆకలుండదు. దాని పొట్టలో కత్తి – అదొక్కటే అతడి కళ్లముందు మెదులుతున్న దృశ్యం.

## 2

కాపేసటికి మెలకువ వచ్చింది. లేవబోయాడు కాని శరీరం తూలింది. బుర్ర గిర్రున తిరుగుతున్నది. పగలో రాత్రో మాత్రమే కాదు, మంగళవారమో గురువారమో కూడా తెలియలేదు. ఎన్నాళ్లుగా యిక్కడ పడుకున్నాడు? సారా బాటిల్ ఖాళీ అయింది. చివరి సిగరెట్టు చివరి దమ్ముకూడా పీల్చేశాడు. 'అంతులేని కల' కంటున్నట్టుగా వుంది. రంగిని గురించి కల. దాని గొంతు కోసినట్టుగా, పొట్ట చీల్చినట్టుగా, ఖండ ఖండాలుగా నరికినట్టుగా, జ్వరంగా వుంది. వణుకొస్తున్నది. తను చచ్చిపోతే, ఆ రంగే తన అంత్యక్రియలు జరిపిస్తుందేమో!

ఇంకొక్కరోజు బతకాలి. శక్తినంతా కూడగట్టుకుని లేచాడు. పెంకుటిల్లు. రాత్రి కురిసిన వానకు యిల్లంతా తడైంది. దీపం ముట్టిద్దామనుకున్నా అగ్గిపుల్ల వెలగదు. నీళ్లలో నానిన బట్టలు బరువెక్కాయి. బయట చలిగా వుంది. చీకట్లోనే మెట్లు దిగి కిందికొచ్చాడు. వీధి దీపాలు వెలగటం లేదు. కాలుతీసి కాలు వెయ్యడమే యిబ్బందిగా వుంది. ఒక్క కిళ్లీ కొట్టు కూడా తెరిచిలేదు. సిగరెట్టు కావాలి. ఇప్పుడది ఏం చేస్తున్నదో అనుకున్నాడు. వీధి నిండా దాని ప్రయత్నాలే. చికెన్‌షాపు వాడు, దర్జీవాడు, మున్సిపల్ పార్క్‌లో తోటమాలి, కూరగాయలవాడు, మగ పురుగును చూస్తే చాలు, అది తొండలా మింగేస్తుంది. డబ్బులిస్తే తీసుకుంటుంది. బిర్యానీ పొకెటిచ్చినా, ఓ సారా బాటిలిచ్చానా చాలు. ఎలాగైనా దానికి మగాడి పొందు కావాలి. అలాంటి దాన్నేం చెయ్యాలి? తనను పెళ్లి చేసుకుని, మోసం చేసి, బతుకు నాశనం చేసి, నలుగుర్లో నవ్వుల పాలుచేసిన కామపిశాచికి తగిన శిక్ష ఏమిటి? భగవంతుడా, నా ద్వారా నువ్వే దాని పాపిష్టిజన్మకో ముగింపు పలుకు. తనను చిల్లర దొంగంటారు. దాన్నేమనాలి.

బూట్లు వేసుకున్నాడు. మేజోళ్లలో కత్తిదాచుకున్నాడు. ఇదే దాని శరీరం మీద మరణ సంతకం చేస్తుంది. అది, ఒంటరిగా వున్న సమయంలో పోవాలి. ఉదయం ఎనిమిది – తొమ్మిది మధ్య చీకటి ప్రియులందరూ ఎవరిళ్లకు వారు తిరిగి పోయిన తర్వాత, అది స్నానం చేసి, గుడ్డలు మార్చుకుని, వంట చేసుకుంటున్నప్పుడు, లేదా, కొన్నిసార్లది బద్ధకంగా పదింటి దాకా పడుకుంటుంది. అదేజరిగితే తన పని మరింత సులువవుతుంది. తలుపు తీసుకునివెళ్లి, కప్పుకున్న బ్లాంకెట్ తొలగించి, కసుక్కున... ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే ఒక్క క్షణంలో, అది గుడ్లు తేలేస్తుంది. నీ వళ్లు ఎంత బిగువుగా వుందే రంగీ? ఆ విషయం కత్తికి తెలుస్తుందిలే.

ఇటీవల అతడికి దేవుడు కనిపిస్తున్నాడు. అంతర్వాణి వినిపిస్తున్నది. ఆ ఆదేశాల ప్రకారమే తను దాన్ని చంపాలనుకుంటున్నాడు. కాని అప్పటిదాకా కాసింత తిండి, సారా, సిగరెట్లు లేకపోతే తాను బతకలేడే? మురికివీధిలో మురుగు కాల్వల పక్కన, పూరిళ్లలో, ఆకలికి నకనకలాడుతున్న ఆడ శరీరాలు బేరాలకోసం నిరీక్షిస్తున్నాయి. పాసెంజరు దేవుళ్ల ప్రత్యక్షమైతే తప్ప వాళ్లకు వరాలిచ్చేదెవ్వరు మరి? ప్రతి వూళ్లోనూ సలుపుతున్న పుండులాంటి యిలాంటి వాడ ఒకటి తప్పక వుంటుంది.

తూలుతూ, తూగుతూ నడుస్తున్న శివకు పక్కనున్న పూరికొంపలో నుండి ఓ గొంతు వినిపించింది.

"చలిగా వుందా? లోపలికి రాకూడదా? కుంపటి దగ్గర కాసేపు కూచుని పో".

తిరిగి చూశాడు. ఆమె మొహం గుర్తుపట్టగలడు. బహుశా అదీ తనను పోల్చుకునే వుంటుంది, లోపలికి తొంగిచూశాక. చీరలనే పరదాలుగా కట్టిన చిన్నగది. ఓ కుర్చీ, టేబుల్. కిందపడి వున్న సారా పాకెట్లు, సీసాలు, సిగరెట్ పీకలు, దుర్వాసన. అన్ని ఇళ్లలోనూ యిదే పరిస్థితి. ఆ శృంగార సామ్రాజ్యానికి రాణి ఓ అభాగ్యురాలు.

"తెలుసా?"

"లోపలికి రా, కాచుకుంటావా?"

"ముసల్తొత్తువు. నేనేం చెయ్యాలే?"

"అయ్యో పిలిచినందుకే చులకనైనానా? డబ్బెంతుంది?"

"ఒక్క రూపాయి కూడా లేదు".

"మరేముంది? వాచీ వుందా? సెల్‌ఫోనుందా?"

"నీ యవ్వ.... ఇదిగో... ఇదుంది..." అంటూ వంగి, కత్తి తీసి చూపించాడు.



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## బంగారు కోడిపెట్ట

బంగారం కోసం ఏడు నెలలు నేవాడా ఎడారిలో అన్వేషించి లాస్‌వేగస్ హోటల్లో విశ్రాంతి తీసుకుంటున్నాడో యువకుడు. ఎండలకు, వేడికీ, మొహమంతా కమిలి నల్లబడింది.

"ఎడారి ఒక నిప్పుల గుండం. మలమలా మాడిపోయాననుకోండి. కాని శ్రమ ఫలించింది".

"బంగారం జాడ దొరికిందా?" అంటూ ప్రశ్నించాడు డిటెక్టివ్

"పట్టువదలని విక్రమార్కుణ్ణి నేను. అనుకున్నది సాధించకుండా తిరిగి వస్తానా? ఇసుకలో అంగుళమంగుళం గాలించాను. తిండి తిప్పలు లేక, మురికిబట్టల్తో, చారెడు గడ్డం పెరిగినా, ఆ చిరాకును భరించి బంగారం నిల్వలు కనుగొన్నాను. ఈ ఉదయమే సెలూన్‌లో షేవ్ చేసుకున్నాను. నిన్న చూడాల్సింది. ఎలుగుబంటిలా వుండేది నా ముఖం" అంటూ గర్వంగా నవ్వాడు యువకుడు.

"పట్టిందల్లా బంగారమంటే యిదేనేమో".

"అయితే, ఓ చిక్కుంది. తవ్వకాలు ప్రారంభించటానికి పెట్టుబడి కావాలి. నాతో పార్టనర్‌షిప్‌లో ఒకటి రెండు మిలియన్లు పెట్టగలిగితే, వందల రెట్లు ప్రతిఫలం పొందవచ్చు. అయినా తొందరేం లేదులెండి. ఆసక్తి వున్న వాళ్ళు నన్ను కాంటాక్ట్ చెయ్యండి. నేను రూం నంబర్ 210లో వుంటున్నాను" అంటూ కుర్చీలోంచి యువకుడు.

"నీ మేకపోతు గాంభీర్యం నన్ను ఇంప్రెస్ చెయ్యలేదు. ఆ ఎడారిలో బంగారం వుందో లేదో గాని నీకు కథలు చెప్పటం కూడా రాదని తెలిసింది" అన్నాడు డిటెక్టివ్.

ఆ యువకుడు చెప్పిందంతా అబద్ధమని డిటెక్టివ్ ఎలా పసిగట్టాడు?

---

*సమధానం: ఏడునెలలు ఎడారి ఎండల్లో తిరిగితే పెరిగిన గడ్డం కింది చర్మం కమిలి నల్లబడదు. ఆ రోజే షేవ్ చేసుకున్నాడు గనక. అవి తెల్లగానే వుంటుంది.*

"నేనేం చేసుకోను"

"మనిషికి కత్తి అవసరం ఎంతైనా వుంటుంది. దీని ఖరీదు యాభై రూపాయలు. స్టీలు కత్తి తెలుసా."

"అది పట్టుకుని ఎందుకు తిరుగుతున్నావు?"

ఆమె శరీరంలోని ఏ భాగమైనా కామాన్ని ప్రేరేపించగలదేమోనని పరిశీలనగా చూశాడు.

''ఎవర్నైనా చంపాలనుకుంటున్నావా ఏమిటి?''

అవునన్నట్లు తలూపాడు.

''నీ పెళ్ళాన్నా? రంగి ఎక్కడుంటున్నది''.

''నాకు తెలుసు – నీకు చెప్పను''.

''అది నువ్వనుకున్నంత దుర్మార్గురాలు కాదు. మాలాంటివాళ్లను కట్టుకుని పతివ్రతగా బతకాలని ఆశపడొద్దు.'' ఆమె సరిగ్గా అలా మాట్లాడలేదు గాని, ఆ అర్థం వచ్చేటట్టుగానే పలికింది.

''దాని సంగతి నీకు తెలియదు''.

''నీ సంగతి ఈ వీధిలో అందరికీ తెలుసు నువ్వే తాగి యింట్లో తొంగుంటావు. ఇల్లు ఎలా గడవాలి ? దానికి చాతనైన పని అది చేసింది. ఇప్పుడు కోపగిస్తే ఎలా? అది కావాలని నిన్ను మోసం చేయలేదు''.

''ఇవాళిక్కడ పడుకోనీ. రేపు డబ్బులిస్తానే''.

ఆమె తలు పేసింది.

## 3

ఆ గదిలోనే ఓ మూలకు సింగిల్‌కాట్ వేసి, రెండు పార్టిషన్‌లు పెట్టి బెడ్‌రూం తయారుచేశారు. 'దా' అంటూ అటువైపు నడిచిందామె. మంచం మీద దూది అట్టలుకట్టి గట్టిగా, గుంతలు గుంతలుగా వుంది. పిల్లో కవర్ చిరిగిన ఒక మురికి తలదిండు అక్కడి అదనపు ఆకర్షణ.

మంచం కింద, ఒక ఫ్లాస్క్, రెండు చిన్నగాజు గ్లాసులూ పడున్నాయి. ''టీ తాగుతావా?'' అనడిగిందామె. గోడకున్న అద్దంలో కనిపించిన ప్రతిబింబం చూసి తనను తానే నమ్మలేక పోయాడు శివ. గడ్డం పెరిగింది. మొహం వుబ్బింది. కళ్లు బైటికొస్తున్నట్టుగా భయంకరంగా వున్నాయి. కిళ్లీతో గారపట్టిన పళ్లు నల్లటి గులకరాళ్ల లాగున్నాయి. జుత్తు పెరగటం కాదు గాని సివంగి జూలు లాగింది. ఆమె కొంగుతీసేసి, బ్లౌజుహుక్స్ విప్పింది. మొహంలో ఎక్కడో యింకా యవ్వనం మిగలక పోలేదుగాని, మనిషి అస్తిపంజరం లాగుంది. ఆమె కండ పట్టి వున్నా ఆ క్షణాన అతనికి కోరిక కలిగే అవకాశం లేదు.

''నువ్వొక్కదానివే వుంటున్నావా?''

''ఇద్దరం వుంటాం. కాని దాన్ని నిన్ననే పోలీసులు పట్టుకెళ్లారు''.

''భయమెయ్యదా? ఎవడన్నా దొంగతనానికొస్తే?''

''ఏముందని తీసుకుపోతాడు'' అంటూ దిండు మీద గట్టిగా చరిచింది. దుమ్ము ముక్కులో ప్రవేశించిందేమో, రెండు మూడు సార్లు బిగ్గరగా దగ్గాడు శివ.



''ఇంత చలిలో ఎక్కడికి బయల్దేరావు?''

''ఇప్పుడవన్నీ ఎందుకులే. ఈ రాత్రికిక్కడ పడుకుంటాను''.

''అంతేనా?''

''నాకు డబ్బుకావాలి''.

''దాన్నెందుకు చంపాలనుకుంటున్నావు?''

''అలాంటి వాళ్లకదే శాస్తి. నాకెంత అన్యాయం చేసిందది!''

''నా కన్యాయం చేసిన వాళ్లందర్నీ చంపాలనుకుంటే, ఈ వూళ్లో కనీసం వందమందిని చంపాలి'' అందామె.

''ఆడవాళ్ల సంగతి వేరు!''

''అందరి మంచిచెడులూ ఆ దేవుడే చూసుకుంటాడు. ఎలా రాసుంటే అలా జరుగుతుంది. ఓ మనిషిని చంపటం తప్పని తెలియదా?''

''రంగిని దేవుడు క్షమిస్తాడు గాని నేను క్షమించను''.

''ఆకలేస్తున్నదా?'' అంటూ పేపర్లో చుట్టిన ఓ బన్ను ముక్క తీసిచ్చిందామె.

''డబ్బు సంగతి?''

''కత్తి అమ్ముతానన్నావుగా''.

''ఎంతిస్తావు?''

''రాత్రి గడిపినందుకు కత్తి యిస్తావు''.

''సరే, అలాగే తీసుకో. నాకో ఇరవై రూపాయలివ్వు చాలు. అయిదు రూపాయలకు కూడా కత్తి కొనవచ్చు. అవునూ, నువ్వెప్పుడూ అందంగా లేవా? పెళ్లి చేసుకోవాలనిపించలేదా?''

''ఇప్పుడవన్నీ అనవసరం. ఇక నా పెళ్లి పాడె మీదే?''

''దాన్ని చంపి నిన్ను చేసుకుంటాను''.

''సిగ్గులేదూ. నేనొళ్లమ్ముకుని సంపాదించిన డబ్బు లాక్కోవటానికా? ఇరవై యిస్తాలే. తీసుకుపో. నీ కత్తీ వద్దు. నువ్వూ వద్దు.

నీలాంటి నీచుణ్ణి ఆ దేవుడెలా పుట్టించాడురా నాయనా!''

## 4

ఇంకా తెలతెలవారకముందే, రంగి వుంటున్న రెండు గదుల ఇంటి ముందు నిల్చున్నాడు శివ. ఆకాశంలో అక్కడక్కడా ఎరుపు మరకలు కనిపిస్తున్నాయి. జనసంచారం యింకా ప్రారంభం కాలేదు. ఉద్రేక పడకూడదు. ఇప్పుడే కంట్రోల్ అవసరం. గొంతెండుకు పోతున్నట్టుగా వుంది. కడుపులో నులి పెడుతున్నది. ఆకలితో అసలుకే మోసం వస్తుందేమో.

ఆ వీధి చివర ఒక ఇరానీ హోటల్ బహుశా తెరిచి వుంటుంది. నాలుగు బిస్కట్లు, ఒక్క చాయ సరిపోతాయి. నెమ్మదిగా నడిచాడు.

హోటల్లో ఒకరిద్దరు ఆటోవాళ్లు తప్ప మరెవరూ లేరు. కార్నర్ సీట్లో కూర్చుని ''ఏక్ చాయ్'' అన్నాడు.

బేరర్ కుర్రాడు అనుమానంగా చూశాడు.

కౌంటర్ దగ్గర కూర్చున్న లావుపాటి ఇరానియన్ ''పైసా పూచ్'' అంటూ అరిచాడు.

ఎంత అవమానం! కాని పోట్లాటకిది సమయం కాదు. జేబులోంచి పది రూపాయల నోటు తీసి పట్టుకుని, ''చాయ్, బిస్కట్స్'' అన్నాడు.

లోపల రగులుతున్నది. ఎంతమంది మీదని ప్రతీకారం తీర్చుకోగలడు? వాడికనుమానం వచ్చిందంటే తన వేషం అలా వుందన్నమాట. టీ తాగి, బైటికి వచ్చి, పాన్‌షాపు దగ్గర ఓ సిగరెట్ కొనుక్కున్నాడు. ఇక చాలు. అన్ని అవసరాలూ తీరాయి. చెయ్యవలసిన పని మాత్రమే మిగిలింది. తెల్లవారిందేమో వీధిలో రద్దీ పెరిగింది. అయితేనేం. తనకేమీ యిబ్బంది లేదు. షర్టు జేబులో మాస్టర్ కీ తడిమి చూసుకున్నాడు. అన్నీ సుపరిచితమైన వీధులే. అందరూ తనను గుర్తుపడతారు. అయినా భయం లేదు. పెళ్లాం దగ్గరకు పోవటం తన హక్కు. ఆ యింటికి లోపల్నించి గడియలేదు. తాళం క్లిక్కుమంటే చాలు తెరుచుకుంటుంది. అది చివరిసారిగా, పతిదేవుణ్ణి, యమధర్మరాజుని చూస్తుంది. రంగీ, నిద్రపోతున్నావా! అయితే, నిద్రలోనే పోతావు. ఈ లోకంలో నీకున్నది యిక అయిదు నిమిషాలే.

రోడ్డు మీదికే వుంటుంది గది. పక్కనే కుండీలో ఒక చిన్న పూలమొక్క వున్నది. గులాబీమొగ్గ ఎర్రగా స్వాగతం పలికింది. తలుపుముందర నిలబడి జాగ్రత్తగా తాళం చెవి కుడివైపుకు తిప్పాడు. లోపలచీకటి. నిశ్శబ్దం. మంచం మీద అటువైపుకు తిరిగి పడుకున్నది. సరిగా కనిపించడం లేదు. పైనేమీ కప్పుకోనట్టుంది. నైటీ పైకిపోయింది. తొడలు, పిరుదులు కనిపిస్తున్నాయి. దగ్గరకెళ్లాడు. ముందరికి పొడుచుకు వచ్చిన పొత్తికడుపు వూపిరిలో లయబద్ధంగా కదులుతున్నది. ఏమిటీ చూసేది. ముహూర్తం మించిపోతున్నది. గురిచూసి, కళ్లు మూసుకుని రెండు, మూడు పోట్లు పొడిచాడు. ఆమె గొంతులోంచి సన్నగా అరుపు వినిపించింది. అదే అతడు విన్న చివరి శబ్దం

## 5

పశ్చాత్తాపం లేదు. పగ తీరింది. కోపం తగ్గింది. రిలాక్స్‌డ్‌గా వుంది. ఆ వేడితో చెమట పట్టింది. ఈల వెయ్యాలన్నంత సరదాగా వుంది. వీధిలో అటూ యిటూ చూస్తు కాసేపు నడిచి, ఓ పాన్‌షాపులో సిగరెట్ కొనుక్కుని వెలిగించాడు. పక్కనే బార్బర్ షాపులోంచి, ''ఏం రా శివా, ఎలుగ్గొడ్డులాగా పెంచుకున్నావు జుత్తు. కటింగ్ వద్దా'' అంటూ ఎవరో అరిచారు. ఆ పిలిచింది తన పాత పరిచయస్తుడు గోవిందు.

''బాగున్నావురా, ఎట్లాగుంది బిజినెస్'' అంటూ లోపలికి నడిచాడు శివ. సెలూన్‌లో ఒక సీటు ఖాళీగా వుంది.

''కూర్చో. మా వాడు చేస్తాడు'' అన్నాడు గోవిందు అసిస్టెంట్ వైపుచూసి. అద్దంలో చూసుకున్నాడు. నిజంగానే జుత్తు బాగా పెరిగింది.

''ఏం రా, చాలా రోజులైంది. ఇటువైపు రాక''.

''కటింగ్ వద్దులే. షేవ్ చేసుకుంటాను''.

''దా, కూర్చో. నువ్వు తనను వదిలేసినందుకు, రంగమ్మ చాలా బాధపడిందిరా. కనిపించిన వాళ్లందరికీ చెప్పుకొని ఏడ్చేది''.

''ఏం చెప్పింది''.

''ఏం చెప్పిందంటే, నీ గురించే పాపం, బెంగతో దాని ఆరోగ్యం కూడా పాడైంది'' అంటూ సబ్బునురగ రుద్దాడు మంగలి.

''ఏం రోగమొచ్చింది?''

''టిబి అనుకుంటాను. డాక్టర్ దగ్గర ఎన్నిరోజులు మందు తెచ్చుకుందో!''

''బాగానే వుందే''

''ఇంటికి పోలేదా ఏం? రోగం ముదిరి రంగమ్మ టిబి ఆస్పత్రిలో చేరింది. ఇంట్లో వుంటున్నది సహాయం కోసం వచ్చిన రంగమ్మ చెల్లెలు'' అంటూ అనుమానంగా చూశాడు గోవిందు.

★

## కథా వసంతం-కథల పోటీ

ఆదివారం ఆంధ్రజ్యోతి - అనూస్ హాస్టల్స్, చీరాల
సంయుక్త నిర్వహణలో

# అక్షరాల లక్షరూపాయలు

**10 ఉత్తమ కథలకు -**
**ఒక్కో కథకు 10 వేల రూపాయల బహుమతులు**

### నిబంధనలు

1. ఇతివృత్తం తెలుగువారి జన జీవితాలను ప్రతిబింబించేదిగా ఉండాలి.

2. ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రచురణలో నాలుగు పేజీలకు మించకుండా ఉండాలి.

3. మాండలికంలో రాసినా అన్ని ప్రాంతాలవారికి అర్థమయ్యే విధంగా ఉండాలి.

4. కథపై ఎక్కడా రచయిత పేరు ఉండకూడదు. కథతో జతపరిచే హామీపత్రంలో మాత్రం పూర్తి చిరునామా (ఫోన్ నెంబరుతో పాటు) రాయాలి.

5. డి.టి.పి. చేసినవి మాత్రమే పంపాలి.

6. పోటీకి పంపించేవి తిరిగి పంపించడం సాధ్యం కాదు (కథ జిరాక్స్ కాపీ మీ దగ్గరుంచుకోవడం మంచిది) కనుక దీనికి సంబంధించి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావుండదు.

7. నిర్వాహకులదే అంతిమ నిర్ణయం.

8. కథలు మాకు అందాల్సిన చివరి తేదీ **31.03.2010**

9. బహుమతి కథలు ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురింపబడతాయి. సాధారణ ప్రచురణకోసం మరికొన్ని కథలు తీసుకునే అవకాశం ఉంది.

మీరు కథలు పంపవలసిన చిరునామా:
**కథా వసంతం - కథల పోటీ**
ఆదివారం ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం: 76, అశ్విని లే అవుట్
హుడా హైట్స్, రోడ్ నెం: 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్ -33